E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 01-02-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక: 32 పేజీలు–6 www.ekaburu.com


ఏఐపై నమ్మకం కల్పించమే ప్రధానం » 4లో

## నోటీసు చట్టబద్ధంగా లేదు...
# 'అయినా విచారణకు రెడీ'



గుర్తు తెలియని వ్యక్తులు నా ఇంటి గోడపై నోటీసులు అంటించడం అక్షేపణీయం, ఇది నా రాజ్యాంగ హక్కును కాలరాయడమే..
బాధ్యత కలిగిన వ్యక్తిగా దర్యాప్తునకు సహకరిస్తా.. ,మధ్యాహ్నం 3 గంటలకు సిట్ విచారణకు అందుబాటులో ఉంటా.. ,
జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ సుదీర్ఘ లేఖ, నేడు ఎర్రవల్లి నుంచి నందినగర్‌కు కేసీఆర్ రాక

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ సిట్ జారీ చేసిన నోటీసుల తీరుపై బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నందినగర్‌లోని ఇంటి గోడపై అంటించిన నోటీసు చట్టబద్ధంగా లేదన్నారు. తనకు నోటీసు జారీ చేసే అధికారం సిట్‌కు లేదన్నారు. తన వాంగ్మూలాన్ని ఎర్రవల్లి నివాసంలోనే నమోదు చేయాల్సిన చట్టపరమైన బాధ్యత సిట్‌పై ఉందన్నారు. అయినా మాజీ ముఖ్యమంత్రిగా, శాసనసభలో ప్రతిపక్ష నేతగా, బాధ్యతాయుత పౌరుడిగా దర్యాప్తునకు సహకరిస్తానని ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్ నివాసంలో వాంగ్మూలం ఇచ్చేందుకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ విచారణ అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ వెంకటగిరికి శనివారం కేసీఆర్ సుదీర్ఘ లేఖ రాశారు. తరువాయి 2లో

## 8 రోజులు మృత్యువుతో పోరాడి..


ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి

ఈ-కబురు, లక్డీకాపూల్ (హైదరాబాద్)/నిజామాబాద్ అర్బన్: ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్ను మూశారు. నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లింగ్ ముఠాను అడ్డుకునే క్రమంలో దుండగులు కారుతో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ గాజుల సౌమ్య (23)ను జనవరి 25న నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి 9.41 గంటలకు ఆమె తుది శ్వాస విడిచారు. కాలేయం దెబ్బతినడం, మెదడులో వాపు కారణంగా ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితంలేకపోయింది.
తరువాయి 3లో

## రేపు రాష్ట్రానికి సీఎం రేవంత్

- అందుబాటులో ఉన్న మంత్రులు, నేతలతో భేటీ
- ఈ నెల 4 నుంచి 9 వరకు జిల్లాల పర్యటన



ఈ-కబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ చేరుకోనున్నారు. గత నెల 19న మేడారంలో వనదేవతలను దర్శించుకొని స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన హాజరయ్యారు. 22న రాత్రి స్విట్జర్లాండ్‌లోని అతిపెద్ద నగరం జ్యూరిక్ నుంచి బయలుదేరి అమెరికా వెళ్లారు. 25న మసాచుసెట్స్ రాష్ట్రంలోని హార్వర్డ్ యూనివర్సిటీలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో 21వ శతాబ్దంలో నాయకత్వం అనే కోర్సులో చేరారు. తరువాయి 2లో

## ఈ పొద్దే... పద్దు

- నేడే కేంద్ర బడ్జెట్
- సుస్థిరాభివృద్ధి, తయారీకి ప్రోత్సాహం
- ద్రవ్య క్రమశిక్షణకు, సంస్కరణలకు ప్రాధాన్యం దక్కుతాయని అంచనా
- ఉద్యోగ కల్పనపై దృష్టి
- వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల



ఈ-కబురు, దిల్లీ: సుస్థిరాభివృద్ధిని కొనసాగిస్తూ.. సంస్కరణలను పరుగులు పెట్టించే లక్ష్యంతోపాటు అంతర్జాతీయ ఒత్తిడులను, సుంకాలను తట్టుకునే చర్యలకు ప్రాధాన్యమిస్తూ 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. వరుసగా తొమ్మిదోసారి ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం ఇదే తొలిసారి.
తరువాయి 2లో



## అన్ని స్థానాల్లో మా పార్టీ పోటీ చేస్తోంది

- ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఈ-కబురు,హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో తమ పార్టీ పోటీ చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పేర్కొన్నారు. 116 పురపాలికలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు/డివిజన్లలో భాజపా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని వెల్లడించారు.
» 3లో

## భక్తులను మెచ్చి.. దీవెనలిచ్చి..




- వనంలోకి జన దేవతలు
- అడవిలోకి తరలిన సమ్మక్క, సారలమ్మ
- ఉద్విగ్నంగా సాగిన ఘట్టం
- ఆఖరి రోజు కూడా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన మేడారం మహాజాతర
- 1.50 కోట్ల మంది దర్శించుకున్నట్లు ప్రకటన

ఈ-కబురు, వరంగల్: వెదురు కర్రలే దైవాలుగా.. గద్దెలే గర్భగుడులుగా.. లక్షలాది మంది భక్తుల పూజలందుకున్న వనదేవతల వనప్రవేశం శనివారం ఆదివాసీ గిరిజన సంప్రదాయాల మధ్యన జరిగింది. వనదేవత.. మన దేవత.. జనదేవత అంటూ అపారవిశ్వాసంతో భక్తుల హృదయాలను ఏకం చేసిన సమ్మక్క–సారలమ్మ మళ్లీ వస్తా మంటూ వనానికేగారు. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం నుంచి మొక్కులు స్వీకరించిన తల్లులు వారిని మెచ్చి దీవెనలిచ్చి అశేష జనం వీడ్కోలుతో వనప్రవేశం చేశారు. దీంతో పసుపు–కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్క–రైక బట్టలే సారెలు గా తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం ముగిసింది. ఫిబ్రవరి 4న బుధవారం తిరుగువారం పండుగతో రెండేళ్లకోసారి జరిగే మహాజాతర ప్రక్రియ పరిసమాప్తం అవుతుంది.

ఆదివాసీ సంప్రదాయలతో...
పూజారులు ఆదివాసీ సంప్రదాయలతో వన దేవతలను శనివారం సాయంత్రం వనంలోకి తీసుకెళ్లారు. మేడారం గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ వన ప్రవేశం కార్యక్రమం ఆద్యంతం ఉద్విగ్నంగా సాగింది. ఆ దృశ్యం చూసేందుకు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవతల వనప్రవేశం కార్యక్రమం శనివారం సాయంత్రం పూజలతో మొదలైంది. ఆదివాసీ పూజారులు డోలు వాయిద్యాలతో గద్దెపైకి చేరుకుని పూజలు చేశారు. సమ్మక్క గద్దెపై భక్తులు సమర్పించిన చీరసారె, బంగారం, పసుపు కుంకుమను మేడారం ఆదివాసీలు, పూజారుల కుటుంబీకులు, గిరిజనేతర భక్తులు తీసుకున్నారు. ప్రసాదాన్ని (బెల్లం) తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఒక్కసారిగా గద్దెల ప్రాంగణం అంతా భక్తుల కోలాహలంతో నిండి పోయింది. తరువాయి 2లో

## ఒకరినొకరు హత్తుకొని.. రైలుకు ఎదురెళ్లి..

- ఇంటర్ చదివే ఇద్దరు పిల్లలతో సహా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య
- చర్లపల్లి–ఘట్‌కేసర్ స్టేషన్ల మధ్య ఘటన
- రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు
- ఆత్మహత్యకు తెలియరాని కారణాలు
- బతకడానికి ప్రయత్నించా... సాధ్యం కావడంలేదు
- పార్క్ చేసిన కారులో ఓ సూసైడ్ నోటు గుర్తించిన రైల్వే పోలీసులు



ఈకబురు,బోడుప్పల్: కన్న తల్లి, కడుపున పుట్టిన ఇద్దరు పిల్లలు సహా ఒకరినొకరు హత్తుకుని వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో కలకలం సృష్టించింది. శనివారం తెల్లవారు జామున చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ఎంఎంటీఎస్ డౌన్ లైన్‌లో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన తల్లి, ఇంటర్ చదువుతున్న పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం వెనుకగల కారణాలు ఇంకా తెలియరాలేదు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... బోడుప్పల్ సమీపంలోని చెంగిచర్ల హరితవనం కాలనీలో పిన్నింటి సురేందర్ రెడ్డి కుటుంబం ఎనిమిదేళ్లుగా నివసిస్తోంది. సురేందర్ రెడ్డి దుబాయిలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే ఉంటున్న ఆయన ఏటా రెండు మూడు సార్లు భార్యా పిల్లల వద్దకు వచ్చి వెళ్తుంటాడు. తరువాయి 3లో

## సీఎం రేవంత్‌రెడ్డికి అరుదైన గౌరవం

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో జరిగే ఏఐ పాలసీ సదస్సుకు ఆహ్వానం
- వర్చువల్‌గా హాజరవుతానన్న ముఖ్యమంత్రి



ఈ-కబురు, హైదరాబాద్: ప్రఖ్యాత హార్వర్డ్ కెన్నెడీ స్కూల్(హెచ్‌కేఎస్) మార్చిలో నిర్వహించే తొలి ఏఐ సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. ఈ సదస్సుకు దేశం నుంచి ఆయనకొక్కరికే ఆహ్వానం అందింది.
తరువాయి 2లో



## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణం

ఈ-కబురు,ముంబయి: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ దివంగత అధినేత అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ (62) శనివారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు.
» 3లో



## మార్చి 2న రాష్ట్రానికి రాహుల్ గాంధీ

### డీసీసీ అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరు

ఈ-కబురు, హైదరాబాద్: : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్చి 2వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని హరిత రిసార్ట్‌స్‌లో ఈనెల 21 నుంచి
తరువాయి 3లో

## 'అహింసా పట్టు'.. జాతీయ ట్రెండు



ఈ-కబురు,పట్టు వస్త్రాలంటే అందరికీ మక్కువే. అందులోనూ బెనారసీ, కంచి, మైసూర్.. తదితర పట్టుచీరలంటే మహిళలకు మరింత ప్రియం. ఈ వస్త్రాల తయారీలో వేర్వేరు నైపుణ్యాలున్నా.. పట్టు సేకరణలో ఒకే విధానం ఉంటుంది. పట్టు తంతువు పొడవుగా లభించాలంటే పురుగు బయటకు రాకముందే మరిగే నీటిలో పట్టుగూడు (కకూన్)ను వేసి దారం (తంతువు) తీస్తారు.
తరువాయి 2లో

# నోటీసు చట్టబద్ధంగా లేదు.. 'అయినా విచారణకు రెడీ'

సుప్రీం తీర్పుల ఉల్లంఘన కిందకే..
'సీఆర్‌పీసీ సెక్షన్ 160 ప్రకారం 65 ఏళ్ల వయసు దాటిన నా వాంగ్మూలాన్ని నేను నివసిస్తున్న చోటే నమోదు చేయాలి. నేను కొన్నేళ్లుగా సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోనే నివసిస్తున్నా. భవిష్యత్తులో నాకు పంపే నోటీసులు ఎర్రవల్లి చిరునామాకే పంపాలని జనవరి 29న మీకు లేఖ రాశాను. నా లేఖకు ప్రతిస్పందనగా గుర్తు తెలియని కొందరు వ్యక్తులు మీ సంతకంతో ఉన్నట్లుగా పేర్కొంటున్న లేఖను జనవరి 30న హైదరాబాద్ నందినగర్‌లోని ఇంటి గోడకు అంటించారు. మీ ఆదేశాల మేరకు ఈ లేఖ పంపితే దానిపై నేను తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాను. ఈ విధమైన చర్యలు రాజ్యాంగం, చట్టం పట్ల మీకు గౌరవం లేదనే భావనను కలిగిస్తున్నాయి. వాట్సాప్ లేదా గోడపై నోటీసులు అంటించడం వంటి పద్ధతులు చెల్లవని సుప్రీంకోర్టు అనేక తీర్పులు ఇచ్చింది'అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

నోటీసు జారీ చేసే అధికారం మీకు లేదు
'చట్టవిరుద్ధంగా ఇచ్చిన నోటీసును నేను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం నేను మీ పోలీస్ స్టేషన్ లేదా అనుబంధ స్టేషన్ల పరిధిలో నివసించడం లేదు. కాబట్టి నాకు నోటీసు జారీ చేసే మీకు అధికారం లేదు. నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విస్మరించడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్న చిరునామా ఆధారంగా ఎర్రవల్లి నివాసంలో విచారణకు అంగీకరించడం లేదని జనవరి 30న నాకు పంపిన లేఖలో పేర్కొన్నారు. సెక్షన్ 160 ప్రకారం నోటీసు ఇచ్చే సమయంలో వ్యక్తి వాస్తవంగా నివసిస్తున్న స్థలానికే ప్రాధాన్యత ఉంటుంది. నేను కొన్నేళ్లుగా ఎర్రవల్లిలోనే ఉంటున్నందున నా నివాసంలోనే విచారణ జరపాల్సిన బాధ్యత మీపై ఉంది'అని కేసీఆర్ పేర్కొన్నారు.

నేడు నందినగర్‌కు కేసీఆర్
ఫోన్ ట్యాపింగ్ అంశంలో క్రైమ్ నెం.243/2024 దర్యాప్తునకు సంబంధించి సిట్ ఎదుట హాజరు కావాల్సిందిగా జూబ్లీహిల్స్ ఏసీపీ ఈనెల 29న కేసీఆర్‌కు నోటీసులు అందజేశారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరో రోజున హాజరవుతానని కేసీఆర్ అదేరోజు ఏసీపీకి లేఖ రాశారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం తాను ఉంటున్న ఎర్రవల్లి నివాసంలోనే విచారణ జరపాలని కేసీఆర్ కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న కేసీఆర్‌కు ఏసీపీ మరో నోటీసు జారీ చేస్తూ ఎర్రవల్లిలో విచారణ కుదరదని, నందినగర్ నివాసానికి రావాలని స్పష్టం చేశారు. ఈ నోటీసులపై కేసీఆర్ స్పందిస్తూ ఆదివారం ఏసీపీకి మరో లేఖ రాశారు. చట్టపరమైన అంశాలను పక్కన పెట్టి నందినగర్ నివాసంలో వాంగ్మూలం ఇస్తానని చెప్పారు. విచారణకు హాజరయ్యేందుకు ఎర్రవల్లి నివాసం నుంచి కేసీఆర్ ఆదివారం ఉదయం నందినగర్‌కు చేరుకోనున్నారు.



## రేపు రాష్ట్రానికి సీఎం రేవంత్



మొదటి పేజీ తరువాయి

30న కోర్సు పూర్తి చేసుకొని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ పొందారు. అనంతరం ఒకరోజు అమెరికాలో విశ్రాంతి తీసుకున్న రేవంత్.. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరుకానున్న ఆయన.. అదే రోజున వీలును బట్టి అందుబాటులో ఉన్న మంత్రులు, పార్టీ నేతలతో భేటీ కానున్నట్లు సమాచారం. తన విదేశీ పర్యటన వివరాలతోపాటు రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికల గురించి ఆయన ఈ సమావేశంలో చర్చిస్తారని తెలిసింది.

4 నుంచి జిల్లాలకు...
సీఎం రేవంత్ ఈ నెల 3 నుంచి 8 వరకు జిల్లాల పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారవగా అందులో స్వల్ప మార్పులు జరిగినట్లు సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. ఈ నెల 3కు బదులు 4వ తేదీ నుంచి ఆయన జిల్లాల పర్యటనలు కొనసాగనున్నాయి. ఈ నెల 4న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండి, 6న నిజామాబాద్ రూరల్, 7న రంగారెడ్డి జిల్లా పరిగి, 8న భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు వెళ్లనున్నారు. ఈ నెల 9న మెదక్ జిల్లాకు వెళ్లనున్నప్పటికీ ఏ నియోజకవర్గానికి వెళ్లాలన్న షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. జిల్లాల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు చేస్తారని (ఎన్నికల కోడ్ ప్రభావం లేని ప్రాంతాల్లో), జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడానికి నిరసనగా జరిగే సభల్లో పాల్గొంటారని, మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని సమాచారం.

## సీఎం రేవంత్‌రెడ్డికి అరుదైన గౌరవం



హెచ్‌కేఎస్ డీన్ జెరెమీ వీన్‌స్టయిన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్వాహకురాలు రుక్సాండా రెనిటా, ఇతర సభ్యులు సీఎంను కలిసి కోరారు. హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు.

సీఎంను కలిసిన విద్యార్థులు..
అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో తన చివరి రోజున సీఎం రేవంత్‌రెడ్డి వివిధ సంస్థల ప్రతినిధులు, వర్సిటీలోని వివిధ పాఠశాలలతోపాటు ఎంఐటీ, కొలంబియా తదితర క్యాంపస్‌లోని విద్యార్థులు, పూర్వవిద్యార్థులతో ముచ్చటించారు. నాయకత్వం, విజయాలు, ఆర్థికాభివృద్ధి, అభివృద్ధి నమూనాలు, స్థిరత్వం, పర్యావరణ సమస్యలు, రైతు సంక్షేమం, మహిళలు, యువత సాధికారత అంశాలపై చర్చించారు. తెలంగాణ రైజింగ్ 2047 గురించి వివరించారు. ఈ విజన్‌తో అందరికీ సమాన అవకాశాలు, ఫలాలు అందడంతోపాటు సాధికారత సాధ్యమవుతుందన్నారు. హార్వర్డ్‌లోని భారతీయ విద్యార్థులు దేశానికి తిరిగొచ్చి పనిచేయాలని, తెలంగాణ రైజింగ్ రాయబారులుగా మారాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆయనతో తెలిపారు.

## అన్ని స్థానాల్లో మా పార్టీ పోటీ చేస్తోంది



**హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "భారాస, కాంగ్రెస్‌లు ఒకే దారిలో వెళ్తున్నాయి. భారాస అమలు చేసిన నిర్ణయాలనే కాంగ్రెస్ కొనసాగిస్తోంది. ఎల్ఆర్ఎస్ పేరిట లక్షల మంది ప్రజలను భారాస ప్రభుత్వం బాధ పెట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఇదే పని చేస్తోంది. 15 రోజుల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలి. దీనికి ఫీజును రద్దు చేసి ఉచితంగా చేయాలి. పురపాలికల్లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. రాష్ట్రంలో భాజపా మరింత బలపడుతోంది. ప్రజల సమస్యలను పరిష్కరించి, బలమైన నాయకత్వాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది" అని రామచందర్‌రావు పేర్కొన్నారు.**

## భక్తులను మెచ్చి.. దీవెనలిచ్చి..



దర్శనాల ప్రక్రియను పూర్తిగా నిలిపివేసిన తర్వాత దేవతల వనప్రవేశ ఘట్టం మొదలైంది.

దేవతల వనప్రవేశం ఇలా..
శనివారం సాయంత్రం 5 గంటలకు దేవతల వనప్రవేశం ప్రక్రియ మొదలైంది. మొదట గోవిందరాజులును దబ్బగట్ల గోవర్ధన్, పెనక వెంకటేశ్వర్లు నేతృత్వంలోని పూజారుల బృందం గద్దెల నుంచి సరిగ్గా రాత్రి 7.35 గంటలకు తరలించింది. ఏటూరునాగారం మండలం కొండాయికి అర్ధరాత్రి చేరుకున్నారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజును 7.37 గంటలకు పెనక బుచ్చిరాములు నేతృత్వంలో పూజారుల బృందం మేడారం నుంచి మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల వైపు తీసుకెళ్లింది. మధ్యలో నిద్ర చేసి ఆదివారం సాయంత్రం వీరు గమ్యాన్ని చేరుకోనున్నారు.

మేడారం గద్దెపై ఉన్న సారలమ్మను కాక సారయ్య, కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, పూజారుల బృందం కన్నెపల్లికి తీసుకెళ్లింది. గద్దెపై ప్రతి మెంటె (వెదురుబుట్ట)ను 7.48 గంటలకు తీసుకుని జంపన్న వాగు మీదుగా కన్నెపల్లికి చేర్చారు. అనంతరం 7.58 గంటలకు సమ్మక్కను గద్దె నుంచి పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్ధబోయిన మునీందర్ నేతృత్వంలోని పూజారుల బృందం గద్దె వద్ద పూజలు నిర్వహించి సమ్మక్కను అక్కడి నుంచి కదిలించారు. అక్కడి నుంచి సమ్మక్కను చిలుకలగుట్టకు చేర్చారు. మహా జాతర సందర్భంగా 1.50 కోట్ల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.

ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు..
శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు మేడారం-తాడ్వాయి, మేడారం-గోవిందరావుపేట వయా నార్లాపూర్ రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో వేల సంఖ్యలో వాహనాలు సుమారు 14 గంటలపాటు నిలిచిపోయాయి. దీంతో వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రం వాహనాల్లో బయలుదేరిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఆలస్యంగా చేరుకున్న వారు దేవతల వనప్రవేశం తర్వాత సైతం మొక్కులు చెల్లించుకున్నారు.

## ఈ పొద్దే... పద్దు



దేశీయ డిమాండులో స్తబ్ధత, ద్రవ్యోల్బణం గరిష్ఠాల నుంచి ఓ మాదిరి స్థాయికి చేరడం, అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, కమాడిటీ రేట్లలో హెచ్చుతగ్గులు, ప్రధాన బ్యాంకుల ద్రవ్య లభ్యతలో అసమానతల వంటివి బడ్జెట్ అంచనాలపై ప్రభావం చూపే అవకాశముంది.
స్థానికంగా వినియోగాన్ని పెంచాల్సిన ఒత్తిడిని ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఉపాధి అవకాశాలనూ పెంచాల్సి ఉంది. ద్రవ్యలోటును తగ్గించాల్సి ఉంది. అంతర్జాతీయ అనిశ్చితి కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో సరికొత్త అభివృద్ధి పథాన్ని ఆవిష్కరించడం ఆర్థిక మంత్రికి అతి పెద్ద సవాలే. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడం కఠిన పరీక్షే. రూపాయి పతనం కారణంగా విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో అమ్మకాలు జరుపుతున్నారు.

పెట్రో ఆదాయంపై ఆధారపడతారా..
ప్రభుత్వానికి పాలిచ్చే ఆవులా మారిన పెట్రో రంగాన్నే మళ్లీ ఆదాయం పెంచుకోవడానికి ఆర్థిక మంత్రి నిర్మల ఎంచుకుంటారా అనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతర్జాతీయంగా పెట్రో ధరలు పెరుగుతుండటంతో ఈ రంగంలోనూ పరిమిత అవకాశాలే ఉన్నాయంటున్నారు. డీజిల్, పెట్రోలుపై ఎక్సైజ్ సుంకాన్ని పెంచే అవకాశముంది. నిబంధనలను సరళీకరించి నిర్మాణాత్మక సంస్కరణల ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఆర్థిక మంత్రి ప్రాధాన్యమిచ్చే అవకాశముంది.
ఆర్థిక ఒత్తిడులున్నా వ్యయాల విషయంలో వెనక్కి తగ్గకపోవచ్చని అంటున్నారు. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాంలకు కొత్త పథకాలను ప్రకటించవచ్చు.
మూల ధన వ్యయాన్ని పెంచే చర్యలు చేపట్టవచ్చు. రైల్వేలు, పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్తు పంపిణీ, రక్షణ, పట్టణ రవాణా రంగాలకు ప్రాధాన్యం దక్కే అవకాశముంది. చిన్నపరిశ్రమల ప్రోత్సాహకానికి క్రెడిట్ గ్యారంటీ కేటాయింపులను పెంచవచ్చు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, విద్యుత్తు రవాణా, దేశీయంగా శుద్ధ ఇంధనపరికరాల తయారీకి ప్రాధాన్యం లభించవచ్చు.
పన్నుల్లో భారీ మార్పులు ఉండకపోవచ్చని అంటున్నారు. కార్పొరేట్ పన్నులను పెద్దగా కదిలించకపోవచ్చు. వినియోగాన్ని పెంచేందుకు వ్యక్తిగత ఆదాయ పన్నులో స్వల్ప ఊరట కల్పించవచ్చని భావిస్తున్నారు.

వరుసగా రికార్డు
నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది తొమ్మిదోసారి. ఇప్పటివరకూ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఆయన వరుసగా ప్రవేశపెట్టలేదు. వేర్వేరు సమయాల్లో అందించారు. మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ ఆయన వరుసగా చేయలేదు. నిర్మలా సీతారామన్ మరోఅరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె 2019 మే 31న ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2026 జనవరి 31 నాటికి ఆమె ఈ పదవిలో 6 ఏళ్ల 8 నెలలు పూర్తి చేసుకున్నారు. గతంలో సి.డి. దేశ్‌ముఖ్ ఆరేళ్ల రెండు నెలలపాటు నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా పనిచేశారు.

బడ్జెట్ అంకెలు తర్వాత మారిపోతాయా?
కొత్త స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) విలువలు, వినియోగ వస్తు ధరల సూచీలు బడ్జెట్ ప్రవేశపెట్టిన కొన్ని రోజుల తరువాత విడుదల కానున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ప్రస్తావించనున్న అంకెలు ఆ తర్వాత మారిపోతాయా అని కాంగ్రెస్ శనివారం ప్రశ్నించింది. ఈ పరిస్థితి విధాన రూపకల్పనలో మోదీ ప్రభుత్వ సమన్వయ రాహిత్యాన్ని తెలియజేస్తోందని ఆ పార్టీ పేర్కొంది. బడ్జెట్‌లో ప్రస్తావించే అనేక గణాంకాలను జీడీపీలో అవి ఎంత శాతమన్న ప్రాతిపదికన పేర్కొంటారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## 'అహింసా పట్టు'.. జాతీయ ట్రెండు

వేడి నీటిలో వేయడంతో పురుగు చనిపోతుంది. దీనికి భిన్నంగా పురుగును చంపకుండా తీసే పట్టుకు 'అహింసా పట్టు' అని పేరొచ్చింది. దీన్ని ఎరి పట్టు అంటారు. ఈ ప్రక్రియలో చిమ్మట (పురుగు)ను పట్టుగూడు నుంచి వేరుచేసి గూడును మాత్రమే వేడినీటిలో మరిగించి దారం తీస్తారు. ఈ ప్రక్రియలో పొడవైన తంతువు రాదు. చిన్న ముక్కలుగా విరిగిపోతుంది. వీటిని మెలివేసి పట్టు నూలు తయారు చేస్తారు. ఇది సాధారణ పట్టు కంటే కాస్త గట్టిగా, మృదువుగా ఉంటుంది. గూడు నుంచి వేరుచేసిన పురుగులు మళ్లీ గుడ్లు పెడతాయి. ఎరి అంటే.. ఆముదం (హిందీలో ఎరండీ అంటారు) ఆకులను ఈ పట్టుపురుగులకు ఆహారంగా వేస్తారు. అందుకే వీటిని ఎరి పట్టు పురుగులంటారు. ఈ పట్టు రకాన్ని 'ఎరి పట్టు' అని పిలుస్తారు. ఈ వస్త్రాలను ఎక్కువగా ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, సిక్కింలలో తయారు చేస్తుంటారు. తరాలుగా ఈ కళను (విధానాన్ని) పరిరక్షిస్తున్న మేఘాలయలోని ఖాసీ సమాజాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. గణతంత్ర దినోత్సవంలో... ముఖ్య అతిథులుగా విచ్చేసిన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయన్, కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పట్టుతో తయారు చేసిన కండువాలు ధరించిన విషయం తెలిసిందే.



# మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణం



ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె ఖ్యాతి గడించారు. అధికార మహాయుతి కూటమిలో భాగమైన ఎన్సీపీ శాసనసభాపక్షం ఆమెను తమ నాయకురాలిగా ఎన్నుకుని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖను అందించింది. దానిని గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు పంపారు. సునేత్రకు ఎక్సైజ్ శాఖ కేటాయించారు. ఆర్థిక శాఖను కేటాయించలేదు. ఆమెకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగకుండా పనిచేయడం ద్వారా ఆమె అజిత్ ఆశయాన్ని సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. సునేత్ర ప్రమాణంతో ఎన్సీపీ చీలిక వర్గాల విలీనానికి విఘాతం కలిగినట్టు కనిపిస్తోంది.

**మాకు సమాచారం లేదు: శరద్**

పదవీ స్వీకార ప్రమాణం గురించి తమకు సమాచారమే లేదని, పత్రికల ద్వారానే విషయం తెలిసిందని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. 'మమ్మల్నెందుకు విశ్వాసంలోకి తీసుకుంటారు? వాళ్ల పార్టీ వేరు, మా పార్టీ వేరు' అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 12న చీలికవర్గాల విలీనాన్ని ప్రకటించాలని స్వయంగా అజిత్ పవార్ నిర్ణయించారని, ఆయన ఆకాంక్ష నెరవేరుతుందనే ఆశిస్తున్నామని చెప్పారు. నాలుగు నెలలుగా అజిత్ పవార్, జయంత్ పాటిల్‌లు విలీనం విషయంలో తమతో చర్చిస్తున్నారని, దురదృష్టకర విమాన ప్రమాద ఘటన ఆ ప్రక్రియకు విఘాతం కలిగించిందన్నారు. అజిత్‌ను తిరిగి తీసుకురాలేమని, ప్రస్తుత పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్నది చూడాలని వ్యాఖ్యానించారు.

# ఒకరినొకరు హత్తుకొని.. రైలుకు ఎదురెళ్లి..





యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లపల్లికి చెందిన సురేందర్ రెడ్డి బోడుప్పల్ హరితవనంలో సొంత ఇంటిని నిర్మించుకున్నాడు.అందులో నివసిస్తున్న తన భార్య పిన్నింటి విజయ అలియాస్ విజయశాంతి రెడ్డి (38) హైటెక్ సిటీలోని ఒక ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రూప్ లీడర్‌గా ఉద్యోగం చేస్తోంది. కుమార్తె చైతన్య రెడ్డి (18) పటాన్ చెరులోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, కుమారుడు విశాల్ రెడ్డి (17) అన్నోజిగూడలోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వారిద్దరూ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు.

**ఇంట్లో పూజలు నిర్వహించి...**

భర్త దుబాయ్‌లో, పిల్లలు హాస్టల్‌లో ఉంటుండగా హరితవనంలోని సొంత ఇంటి మొదటి అంతస్తులో సురేందర్ రెడ్డి తల్లితో కలిసి విజయశాంతి రెడ్డి నివాసం ఉంటున్నారు. తన కుమార్తె చైతన్య రెడ్డికి జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఉండడంతో గురువారం ఇంటికి తీసుకొచ్చింది. శుక్రవారం సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి చేరుకున్న విజయశాంతి రెడ్డి ఫ్రెష్ అయి దేవుడికి పూజలు చేసింది.

అదే రోజు కొద్ది సేపటి తర్వాత తమ బంధువులు చనిపోయారని చెప్పి కాలేజీ నుంచి కుమారుడు విశాల్ రెడ్డిని కూడా తీసుకువచ్చింది. అనంతరం రాత్రి తన తల్లి పుష్పకు తమ ఆఫీసులో ఫంక్షన్ ఉందని, తనతోపాటు పిల్లలను కూడా తీసుకువెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయింది. రాత్రి 11 గంటలకు కారు ఘట్‌కేసర్ రైల్వే‌స్టేషన్ పార్కింగ్‌కు చేరుకుంది. కొద్ది సమయం కారులోనే గడిపిన ముగ్గురు ఆ తర్వాత రైల్వే‌స్టేషన్‌లోకి ప్రవేశించారు.

**రైలుకు ఎదురుగా పరుగు...**

శనివారం తెల్లవారు జామున 12.40 గంటల ప్రాంతంలో తల్లి ఇరువురు పిల్లలు ఒకరినొకరు గట్టిగా హత్తుకుని పట్టాలపై ప్రత్యక్షమయ్యారు. వారిని గుర్తించిన గూడ్స్ రైలు పైలట్ సుషాన్ మహతో పలుమార్లు హారన్ చేసినా వారు పక్కకు తప్పుకోకపోగా రైలుకు ఎదురుగా పరుగు తీశారు. రైలు ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు.

లోకోపైలట్ వాకీటాకీ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రైల్వే పట్టాల మధ్యలో తీవ్రగాయాలతో మృతి చెందిన మూడు మృతదేహాలను గుర్తించారు. మృతులు బోడుప్పల్ హరితవనం కాలనీకి చెందిన పిన్నింటి విజయ అలియాస్ విజయశాంతి రెడ్డి, కూతురు చైతన్య రెడ్డి, కుమారుడు విశాల్ రెడ్డిగా గుర్తించి మృతదేహాలను గాంధీ మార్చురీకి తరలించారు. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారం ప్రకారం ఇది ఉద్దేశపూర్వకంగా చేసుకున్న ఆత్మహత్య ఘటనగా పోలీసులు నిర్ధారించారు.

**కుటుంబ కలహాలు లేవు: భర్త సురేందర్ రెడ్డి**

తమ కాపురంలో ఎటువంటి కలహాలు లేవని విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి రైల్వే పోలీసులకు తెలిపాడు. ఆత్మహత్య ఘటన అనంతరం పోలీసులు మొబైల్ ఫోన్ ద్వారా సురేందర్ రెడ్డిని సంప్రదించారు. అప్పటికే తనకు సమాచారం అందిందని తాను దుబాయ్ నుంచి ఇండియాకు బయలుదేరానని చెప్పాడు.

తమ కుటుంబంలో కలహాలు, ఆర్థిక సమస్యలు ఏవీ లేవని తన భార్యా పిల్లలు ఇంత దారుణానికి ఎందుకు పాల్పడ్డారో అర్థం కావడం లేదని ఆయన పోలీసులకు తెలిపాడు. మరోవైపు తన చెల్లికి ఎలాంటి సమస్యలు లేవు అని అన్న చిరంజీవి రెడ్డి వెల్లడించారు. తన బావ, తన చెల్లిది అనోన్యో దాంపత్యమని తెలిపాడు. ఆర్థిక పరంగా ఎలాంటి సమస్యలు లేవన్నాడు.

**సారీ మేడం... ఇంకోసారి తప్పు చేయను**

విజయశాంతి రెడ్డి హైటెక్ సిటీలోని ఒక కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి. అందులో పనిచేస్తున్న 15 మందికి గ్రూప్ లీడర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించి ఆమె మొబైల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. తన మొబైల్ ఫోన్‌లో ఒక నంబర్ నుంచి సారీ మేడం ఇంకోసారి తప్పు చేయను అని ఒక మెసేజ్, గుడ్ మార్నింగ్ మేడం అని మరో మెసేజ్ ఉన్నట్టు పోలీసులు గుర్తించి వారిని పీఎస్‌కు రప్పించి విచారించే ఏర్పాట్లు చేస్తున్నారు.

**సీసీ కెమెరా ఫుటేజీలు గుర్తింపు...**

కారు పార్కింగ్ ఫీజు చెల్లించాలని సిబ్బంది కోరగా స్టేషన్ లోపలికి వెళ్లి వెంటనే వస్తామని చెప్పి హడావుడిగా విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో స్టేషన్ లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. రైల్వే స్టేషన్లోకి వెళ్లిన వారు టికెట్ బుకింగ్ కౌంటర్ల వద్ద చాలా సేపు వేచి ఉన్నట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. టికెట్లు తీసుకునేందుకు ప్రయత్నించిన వారు తర్వాత టికెట్లు తీసుకోకుండానే ప్లాట్ ఫారం వైపు వెళ్లిపోయినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

**నాతో పాటు పిల్లలు కూడా...**

చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద విజయశాంతి పార్కు చేసిన కారులో పోలీసులు ఓ సూసైడ్ నోటు ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. కారు గేర్ బాక్సు పక్కనే ఒక చిన్న పేపరులో ఆమె చేతిరాతతో రాసినట్లుగా ఉన్న నోట్ లభించింది. ఆ నోట్లో 'అమ్మా.... నేను బతకడానికి చాలా ప్రయత్నం చేశాను.. నా వల్ల సాధ్యం కావడం లేదు. అందుకే చనిపోవాలని నిర్ణయించుకున్నా... నాతో పాటే నా పిల్లలను కూడా తీసుకుపోతున్నా'అని ఆ నోట్లో రాసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే కారు తాళాలు ఆమె కుమారుడి ప్యాంటు జేబులో పోలీసులకు లభించాయి. గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# 8 రోజులు మృత్యువుతో పోరాడి..



**గంజాయి స్మగ్లింగ్ ముఠాను పట్టుకునే ప్రయత్నంలో..**

జనవరి 23న గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు నిజామాబాద్ శివారులోని మాధవనగర్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులను చూసిన గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులు పారిపోయేందుకు యత్నించారు. దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు.

అదే సమయంలో ముఠా సభ్యులు తమ కారుతో సౌమ్యను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు ఆమెను హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఎనిమిది రోజులపాటు సౌమ్య ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడారు. బాసటగా నిలిచిన ఎక్సైజ్ అధికారులు దగ్గరుండి ఆమెకు చికిత్స చేయించారు.

ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆమెను పరామర్శించారు. సౌమ్య చికిత్స కోసం ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసింది. నిజామాబాద్ జిల్లా మోస్రాకు చెందిన సౌమ్యది సామాన్య కుటుంబం. 2024 సంవత్సరంలో సౌమ్య ఉద్యోగంలో చేరింది. అంతలోనే ఆమె మరణించడంతో కుటుంబీకులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

# మార్చి 2న రాష్ట్రానికి రాహుల్ గాంధీ



నిర్వహించనున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం ముగింపు రోజున ఆయన హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. 21వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు పది రోజులపాటు హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ, ఏపీకి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు.

టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి (టీఆర్ఆర్) ఈ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌కు ఏఐసీసీ అనుమతి లభించడంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రామ్మోహన్‌రెడ్డి శనివారం సాయంత్రం హరిత రిసార్ట్స్‌లో శిక్షణ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు సమకాలీన రాజకీయ అంశాలపై తెలంగాణ, ఏపీలకు చెందిన డీసీసీ అధ్యక్షులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎన్నికల సందర్భంగా టికెట్ల కేటాయింపుతో సహా పార్టీ కమిటీల నిర్మాణం తదితర అంశాల్లో పీసీసీ అధ్యక్షులను క్రియాశీలం చేయాలనేది రాహుల్ గాంధీ ఆలోచన. ఇందుకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షులను నియమిస్తున్నారు.

ఇప్పటివరకు దేశంలోని 14 రాష్ట్రాలకు డీసీసీ అధ్యక్షులను నియమించారు. అందులో గుజరాత్, హరియాణా, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ డీసీసీ అధ్యక్షులకు పది రోజుల రెసిడెన్షియల్ శిక్షణను ఇప్పటికే పూర్తి చేశారు. ఈ దఫా అనంతగిరి కొండలు వేదికగా తెలంగాణ, ఏపీ జిల్లాల అధ్యక్షులకు శిక్షణ ఇవ్వనున్నారు.

# 45రోజుల్లో కంచె నిర్మిస్తాం

ఈకబురు, కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. చొరబాటుదార్లను కాపాడుతోందని, అవినీతిని వ్యవస్థీకృతంగా మార్చిందని, ఎన్నికల్లో లబ్ధి కోసం సరిహద్దుల్లో భద్రతను ఉద్దేశపూర్వకంగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. దేశ భద్రత కోసం బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం అత్యవసరం అని తేల్చిచెప్పారు.

ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బారక్‌పూర్‌లో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అనేది రాజకీయపరమైన అంశం కాదని.. దేశ భద్రత కోణంలో పార్టీని గెలిపించుకోవాలని స్పష్టంచేశారు.

చొరబాటుదార్లను ముద్దు చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి భూమి కేటాయించాలని కోర్టు ఆదేశించినా మమతా బెనర్జీ ప్రభుత్వం లెక్కచేయడం లేదని ఆరోపించారు. చొరబాటుదార్లను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని, అంతిమంగా దేశ భద్రతకు ప్రమాదం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

పొరుగుదేశం నుంచి పశ్చిమ బెంగాల్‌లోకి విచ్చలవిడిగా అక్రమ వలసలు కొనసాగుతున్నాయని చెప్పారు. చొరబాటుదార్లను అడ్డుకోవడానికి బెంగాల్ ప్రభుత్వం గానీ, పోలీసులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. చొరబాటుదార్లు బెంగాల్‌లో సులువుగా లభిస్తున్న ఫేక్ డాక్యుమెంట్లు తీసుకొని దేశమంతటా విస్తరిస్తున్నారని చెప్పారు.

**నేను హామీ ఇస్తున్నా..**

"సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహకరించడం లేదని సాక్షాత్తూ కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. బీఎస్ఎఫ్‌కు భూమి ఇవ్వడం లేదని ఆక్షేపించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మార్చి 31వ లోగా ప్రభుత్వం భూమి కేటాయించాలి. ప్రభుత్వం స్పందించినా స్పందించకపోయినా.. నేను హామీ ఇస్తున్నా. ఏప్రిల్‌లో బీజేపీ ముఖ్యమంత్రి కొలువుదీరడం తథ్యం.

బీజేపీ ప్రభుత్వం రాగానే 45 రోజుల్లోగా కంచె నిర్మాణం పూర్తిచేస్తాం. హామీలు అమలు చేయడంలో రికార్డులు సృష్టించిన ఘనత బీజేపీదే. అస్సాంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక చొరబాటుదార్లను కట్టడి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అక్రమ వలసలు యథేచ్ఛగా జరిగాయి. బీజేపీ రాగానే పరిస్థితి మారిపోయింది. అస్సాం తరహాలో బెంగాల్‌లోనూ చొరబాట్లను అడ్డుకోవడం ఖాయం.

**ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగాల్సిందే**

బెంగాల్‌లో కేవలం చొరబాటుదార్ల ఓట్ల కోసమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను మమతా బెనర్జీ గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు. ఎవరికి నచ్చినా నచ్చకున్నా సరే ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదార్ల పేర్లు తొలగించక తప్పదు. ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగాల్సిందే. బెంగాల్‌లో మతువా, నామశూద్ర సామాజిక వర్గాలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వేధింపులకు గురిచేస్తోంది.

ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో త్వరలో రాబోతున్న బీజేపీ ప్రభుత్వం మీకు రక్షణ కల్పిస్తుంది. మమతా బెనర్జీ పాలనలో అవినీతి వ్యవస్థీకృతంగా మారింది.



అవినీతి మంత్రులకు ఎన్నికల్లో టికెట్లు నిరాకరించే ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా? బీజేపీ వచ్చాక అవినీతిపరులను కఠినంగా శిక్షిస్తాం. వందేమాతర గీతంపై పార్లమెంట్‌లో చర్చ చేపట్టడాన్ని తృణమూల్ కాంగ్రెస్ వ్యతిరేకించింది.

చొరబాటుదార్లను బుజ్జగించడానికే ఆరాటపడింది. అందుకే ఆ పార్టీని కూకటివేళ్లతో సహా పెకిలించివేయాలి. దేశభక్తులు, జాతీయవాదుల ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలి. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 50 శాతానికి పైగా ఓట్లు సాధించి అధికారంలోకి వస్తుంది. 2026 సంవత్సరం తృణమూల్ కాంగ్రెస్‌కు టాటా, బైబై చెప్పే సంవత్సరం"అని అమిత్ షా స్పష్టంచేశారు.

# అంబటి నోట మురికి మాటలు

ఈకబురు, అమరావతి: గుంటూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి రెచ్చిపోయారు. ఈసారి అన్ని హద్దులూ మీరిపోయి మురికి భాషతో విరుచుకుపడ్డారు. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాయడానికి వీలుకాని తీవ్ర అసభ్య, అసహ్య పదాలు, బూతులతో దూషణలకు పాల్పడ్డారు. ఆగ్రహించిన కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దిగాయి. గుంటూరు సిద్ధార్థనగర్‌లో శనివారం సాయంత్రం అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయంపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అతనిపైనా దాడి చేశారు. రాష్ట్రవ్యాప్తంగానూ కూటమి శ్రేణుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అంబటిపై తక్షణమే చర్య తీసుకోవాలన్న డిమాండ్లతో ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నల్లపాడు ఎస్సై కె.రామకృష్ణ చేసిన ఫిర్యాదుల మేరకు నమోదైన కేసుల్లో.. అంబటిని శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీపై గుంటూరు అమరావతి రోడ్డులోని గోరంట్ల వద్ద 'మహాపాపం' పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్దకు శుక్రవారం వెళ్లిన మాజీ మంత్రి అంబటి రాంబాబు.. దాన్ని 24 గంటల్లో తొలగించాలని, లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. శనివారం ఉదయం రాంబాబు గోరంట్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, ఫ్లెక్సీ ఉన్న రోడ్డులో కారులో వెళ్తుండగా, తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. ఆగ్రహించిన రాంబాబు కారులోంచే బూతులు అందుకున్నారు. 'కొట్టమను.. కొట్టమను చూస్తాను నా కొడుకులను, రండిరా నా కొడకల్లారా రండిరా' అంటూ పదేపదే విరుచుకుపడ్డారు. ఆ సమయంలో రాంబాబుతో పాటు కారులో ఉన్నవారు తీసిన వీడియోల్లో ఈ బూతులన్నీ రికార్డయ్యాయి. ఈ అసహ్య, అసభ్య దూషణలపై కూటమి శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. కారుపై కర్రలు, పిడిగుద్దులతో దాడి చేశాయి. అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు రాంబాబుకు చెబుతున్నా వినిపించుకోకుండా.. మళ్లీ బూతులతో రెచ్చగొట్టారు. ఆయన కారులోంచి దిగేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు అద్దాన్ని కిందకు దించి, చంద్రబాబుపై మురికి భాష వాడారు. అసభ్యంగా దూషించారు. తుదకు పోలీసులు అతన్ని అక్కడి నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది. కాసేపటికి అంబటి మురికి మాటలు సామాజిక మాధ్యమాలు, మీడియాలో ప్రసారం కావడంతో తీవ్ర దుమారం రేగింది. రాంబాబును అరెస్టు చేయాలంటూ తెదేపా శ్రేణులు డిమాండ్ చేశాయి.

ఈ ఘటన జరిగాక అంబటి రాంబాబు సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'చంద్రబాబు నాయుడిని తిట్టేశానంట. చంద్రబాబు, లోకేశ్ కలసి రాంబాబును ఇవాళ అరెస్టు చేసేయాలంట. చేసుకోండి. ఇప్పుడే కాదు, ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నా. నీ రెడ్‌బుక్‌ను నా కుక్క కూడా లెక్కచేయదని చెప్పా. అరెస్టుకు సిద్ధంగా ఉన్నా. బెయిల్‌కు కూడా వెళ్లను. అరెస్టు చేస్తారని తెలుసు. పారిపోను. నా ఇంట్లోనే ఉంటా. మీరొచ్చి అరెస్టు చేయడమేంటయ్యా? తీసుకెళ్లండి, వెళ్లిపోతాను. ఈ రకంగా అన్యాయమైన, అక్రమమైన అరెస్టులు చేస్తారా మీరు? ఆ క్షణంలో నేను అన్న మాటలను ఆసరాగా తీసుకుని చంద్రబాబు చర్చించుకున్నాడంట! వెంటనే అరెస్టు చేయమన్నారంట! నా ఇంటి దగ్గర బలగాలను పెట్టారు. ఐ డోంట్ కేర్. మరోసారి చెబుతున్నా చంద్రబాబుకు, చంద్రబాబు కొడుక్కి! మీ రెడ్‌బుక్‌కి నా ఇంట్లో కుక్క, తోటలో ఉన్న రెండు కుక్కలు కూడా భయపడవ్. అరెస్టులకు సిద్ధపడే రాజకీయాల్లో ఉండాలని నిర్ణయించుకున్నా. ఇవాళ దొరికాననుకుంటున్నారు, కానీ దొరకలేదు. ఇంతమంది పోలీసులు ఉన్నారు కదా.. ఒక్కరి (నిరసనకారులనుద్దేశించి) దగ్గరి నుంచైనా రాడ్డు తీసుకున్నారా? కర్ర తీసుకున్నారా వెనక్కి? తీసుకోలేదు. నన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడితే, రిమాండ్ విధిస్తే వెళ్తాను. జైల్లో ఉంటా. నీ సంగతి తేలుస్తాను చంద్రబాబు గుర్తుపెట్టుకో. భయపడేవాడు కాదు ఈ అంబటి రాంబాబు' అని ఆగ్రహంతో ఊగిపోయారు.

**తెలుగు మహిళపై దాడి**

అంబటి వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగు మహిళ నాయకురాలు లంకా మాధవి ఆయన ఇంటి వద్దకు వెళ్లి చెప్పు చూపించి నిరసన తెలిపారు. అక్కడే ఉన్న వైకాపా మహిళలు ఆమెను వెంబడించి కొట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు మహిళలు, కార్యకర్తలు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గళ్లా రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చీపుర్లు, కోడిగుడ్లతో వచ్చి నిరసన తెలిపారు. రాంబాబు బయటకు వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబటి ఫ్లెక్సీలను కర్రలతో కొడుతూ నిరసన తెలిపారు.



**గుంటూరులోని అంబటి ఇంటి వద్ద తెదేపా కార్యకర్తల ఆగ్రహంతో ధ్వంసమైన వాహనం**

**భగ్గుమన్న కూటమి శ్రేణులు**


చంద్రబాబుపై అంబటి మురికి భాషపై ఎన్డీయే భాగస్వామ్య పార్టీల శ్రేణులు భగ్గుమన్నాయి. తెలుగు తమ్ముళ్లు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇలా అన్నివర్గాల వారు రాంబాబు నివాసం, కార్యాలయంపై దాడిచేశారు. ఇల్లు, కార్యాలయం అద్దాలు, ఫర్నిచర్, ఏసీలు ధ్వంసమయ్యాయి. ఐదు కార్ల అద్దాలు పగిలాయి. ఆ సమయంలో రాంబాబు తన ఇంట్లో వైకాపా కార్యకర్తలతో కలసి ఉండగా, బయట పోలీసులు కాపలాగా ఉన్నారు. ఆందోళనకారులు కాసేపటికి రాంబాబు వైపు దూసుకెళ్లారు. పోలీసులు అడ్డుకున్నా, అతనిపై చేయిచేసుకున్నారు. కర్రలతో ఉన్న కొందరు వైకాపా కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులు.. తెదేపా నేతలను బయటికి పంపించి గేట్లు వేసేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దివ్యాంగులు వచ్చి నిరసన తెలిపారు. అంబటి గంజాయి మత్తులో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో అంబటికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంను తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. రాంబాబుతో పాటు వైకాపా నేతల కార్లు 5 ధ్వంసమయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు అంబటి ఇల్లు, కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగింది.

# భారత్‌కు ఏటా 8-10 బి. డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణాలు




దిల్లీ: వచ్చే అయిదేళ్ల పాటు ఏటా 8-10 బి. డాలర్ల (దాదాపు రూ.72,800-91,000 కోట్ల) మేర రుణాలు ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు అంగీకరించింది. ఆ మేరకు కొత్త కంట్రీ పార్టనర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్)ను ప్రపంచ బ్యాంక్ గ్రూప్, భారత్ ప్రకటించాయి. ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలన్న మనదేశ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి వృద్ధి దశను వేగవంతం చేసేందుకు ఈ రుణాలు సహాయపడతాయి. 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సీపీఎఫ్ ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ నిధులను జత చేసి గ్రామీణ, పట్టణ భారత్‌లో మరిన్ని ఉద్యోగాలను సృష్టించడంపై సీపీఎఫ్ దృష్టి సారిస్తుందని ఆమె అన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్ బంగా నేతృత్వంలోని బృందంతో చర్చలు జరిపిన అనంతరం, ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఏఐపై నమ్మకం కల్పించమే ప్రధానం



భారతదేశం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) రంగంలో ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తోంది. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆ వ్యవస్థపై నమ్మకాన్ని అందించే సమయం ఆసన్నమైందని ప్రముఖ ఏఐ సంస్థ థింక్360.ఏఐ వ్యవస్థాపకులు, సీఈఓ అమిత్ దాస్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ 2026 నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ఇండియా డిజిటల్ రంగంలో ఇప్పటికే ఆధార్, యూపీఐ, డేటా షేరింగ్ వంటి విభాగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అమిత్ దాస్ గుర్తు చేశారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అద్భుతాలు సృష్టిస్తోందని అన్నారు. డిసెంబర్ 2025లోనే యూపీఐ ద్వారా 21.6 బిలియన్ లావాదేవీలు జరగడం, వాటి విలువ సుమారు రూ.28 లక్షల కోట్లకు చేరడం భారత్ సాధించిన డిజిటల్ వృద్ధికి నిదర్శనమని చెప్పారు.

ఈ విజయాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లాలంటే జాతీయ స్థాయిలో ఏఐపై నమ్మకాన్ని పెంపొందించే విధానం అవసరమని అభిప్రాయపడ్డారు. ఇది ఏఐ వ్యవస్థలను ప్రామాణీకరించడం, ఆడిట్ చేయడం, ఫలితాలను పారదర్శకంగా పర్యవేక్షించడం ద్వారా వ్యవస్థాగత ప్రమాదాలను తగ్గిస్తుందని వివరించారు.

**వికసిత్ భారత్ 2047**

'వికసిత భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడానికి కేవలం పైలట్ ప్రాజెక్టులు సరిపోవని, ప్రభుత్వ, ఆర్థిక వ్యవస్థల మూలాల్లో డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవాలని దాస్ స్పష్టం చేశారు. నవంబర్ 2025లో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) రూల్స్ నోటిఫై చేయడాన్ని ఆయన స్వాగతించారు. 18 నెలల అనుసరణ గడువు ఉన్న నేపథ్యంలో బడ్జెట్ 2026లో ఈ క్రింది అంశాలకు నిధులు కేటాయించాలని కోరారు.

డేటా గోప్యతను కాపాడే సాంకేతికత అభివృద్ధి.

పౌరుల అనుమతితో కూడిన డేటా నిర్వహణ వ్యవస్థల ఏర్పాటు.

బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్) రంగంలో సంస్కరణలు

# సోషల్ మీడియా.. 'చిన్నారుల మెదళ్లను తినేస్తుంది' - అమితాబ్

దేశ యువత సోషల్ మీడియా (Social Media) విపరీత వాడకంపై ఇటీవలి ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ డిజిటల్ వ్యసనం ఆర్థిక దుష్పరిణామాలకు దారితీస్తుందని, వయసుపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందన్న సూచనలపై నీతిఆయోగ్ (NITI Aayog) మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ ఏకీభవించారు. చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందన్న ఆయన.. స్కూళ్లు, కాలేజీల్లో వీటి వాడకాన్ని నిషేధించాలన్నారు.

"సోషల్ మీడియాలో వయోపరిమితి అవసరమని ఆర్థిక సర్వే సూచనతో వందశాతం ఏకీభవిస్తున్నా. ఇది చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉత్పాదకతను, ఏకాగ్రతను తగ్గిస్తుంది. దీని ఫలితంగా దీర్ఘకాలంలో ఆన్‌లైన్‌లో ఉంటూ, వాస్తవిక ప్రపంచంలో కష్టపడి పనిచేయలేని తరం ఏర్పడుతుంది. ఇలా మనం వికసిత్ భారత్‌ను నిర్మించలేం. నిజానికి.. స్కూళ్లు, కాలేజీల్లో దీన్ని పూర్తిగా నిషేధించాలి" అని అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు.

**ఆర్థిక సర్వే ఏం చెప్పింది..?**

భారత్‌లో యువత సామాజిక మాధ్యమాల వినియోగం తీరుపై ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. దేశంలో ఈ డిజిటల్ వ్యసనం తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించింది.



# 20% తగ్గిన వెండి ఈటీఎఫ్‌లు




**అంతర్జాతీయ మార్కెట్లో రికార్డు స్థాయిల వద్ద ట్రేడవుతున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలాయి. ఈ పరిణామంతో వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు కూడా 20 శాతానికి మించి పతనం అయ్యాయి.**

దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.33,113 (18%) తగ్గి 10 గ్రాములకు రూ.1,50,849కు పడిపోయింది. గురువారం ఈ కాంట్రాక్టు రూ.1,93,096 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకింది.వెండి మార్చి కాంట్రాక్టు రూ.1,07,971 (27%) తగ్గి కిలోకు రూ.2,91,922కి పడిపోయింది. గురువారం ఇది రూ.4,20,048 వద్ద జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. వెండి మే, జులై కాంట్రాక్టులు కూడా వరుసగా 27%, 24% క్షీణించాయి. ఈ ప్రభావం గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లపై పడింది. దీంతో మదుపరులు భారీగా నష్టపోయారు.ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 20.50%, యాక్సిస్ సిల్వర్ ఈటీఎఫ్ 20.16%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటీఎఫ్ 20.14% క్షీణతను నమోదు చేశాయి. కోటక్, డీఎస్‌పీ, ఎడిల్‌వీజ్, యూటీఐ, మోతీలాల్ సిల్వర్ ఈటీఎఫ్‌లూ 19% వరకు పతనం అయ్యాయి.

బంగారం విషయంలోనూ గత ఏడాది కాలంగా 104% భారీ రాబడిని అందించిన నిప్పాన్ ఇండియా ఈటీఎఫ్ గోల్డ్ బీఈఎస్ శుక్రవారం 10.52% పతనం అయ్యింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, యాక్సిస్, కోటక్, మిరే అసెట్‌ల గోల్డ్ ఈటీఎఫ్‌లూ 912% పతనం అయ్యాయి.

**ఎందుకీ పతనం..**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త ఛైర్మన్‌గా కఠిన నిర్ణయాలు తీసుకునే కెవిన్ వార్ష్‌ను నియమితులు కానుండటం మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. మే నెలలో జెరోమ్ పావెల్ పదవీకాలం ముగియనుండటంతో, ఆ స్థానంలో కెవిన్ వస్తారు. ఈ పరిణామంతో డాలర్ పుంజుకుని, బంగారం ధరలపై ఒత్తిడి పెరగడానికి కారణం అయ్యింది.

**మదుపరులు ఏం చేయాలి?**

ఈ భారీ పతనాన్ని కొనుగోలు అవకాశంగా భావించాలా? లేక మార్కెట్ స్థిరపడే వరకూ వేచి చూడాలా అనే విషయంలో 'జాగ్రత్తగా ఉండాలని' నిపుణులు సూచిస్తున్నారు.

సోలార్ ప్యానెల్స్, విద్యుత్ వాహనాలు (ఈవీ), కృత్రిమ మేధ మౌలిక వసతుల రంగాల నుంచి వెండికి గిరాకీ బలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్నారు. 2025లో భారీ లాభాల తర్వాత, ఇప్పుడు ఒకేసారి మొత్తం పెట్టుబడిని వెండికే కేటాయించడం ప్రమాదకరమని అంటున్నారు.

ఈ లోహాల ధరలు బాగా తగ్గినా కూడా, జాగ్రత్తగా గమనించాలని.. వారాలు/నెలల్లో విడతలవారీగా కొనుగోలు చేయడం ఉత్తమమని చెబుతున్నారు. సురక్షిత పెట్టుబడి కోసం పోర్ట్‌ఫోలియోలో 1015% వరకు ఈ లోహాలకు కేటాయించొచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఆకాశాన్నంటిన ధరల కారణంగా భారత్‌లో పసిడికి గిరాకీ గణనీయంగా తగ్గింది.

# జియోబీపీ యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్

ఇంధన రిటైలింగ్, మొబిలిటీ సంస్థ జియోబీపీ తాజాగా ఇండియా ఎనర్జీ వీక్ సందర్భంగా వినూత్నమైన 'యాక్టివ్' టెక్నాలజీ పెట్రోల్‌ని ఆవిష్కరించింది. కీలకమైన ఇంజిన్ విడిభాగాలను శుభ్రంగా ఉంచుతూ, పనితీరును మెరుగుపరుస్తూ, మెయింటెనెన్స్ వ్యయాలను తగ్గిస్తూ, అదనంగా ఖర్చులేమీ లేకుండా వాహనం ఏటా మరో 100 కి.మీ. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు ఉపయోగపడేలా ఈ ఇంధనం ఉంటుందని సంస్థ తెలిపింది. మోటర్‌సైకిల్‌లో నింపి, కోయంబత్తూరులోని టెస్ట్ ట్రాక్‌లో 4,000కు పైగా కి.మీ. మేర దీని సామర్థ్యాలను ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు సంస్థ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. దేశీయంగా వాహనదారులు సాఫీగా నడిచే, విశ్వసనీయమైన, తక్కువ మెయింటెనెన్స్ ఉంటూ ఇంధనంపై అదనంగా వెచ్చించకుండా ఎక్కువ మైలేజీ ఉండాలని కోరుకుంటారని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే జియో-బీపీ యాక్టివ్ టెక్నాలజీ పెట్రోల్‌ని రూపొందించినట్లు వివరించారు. దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్ దిగ్గజం బీపీ కలిసి జియో-బీపీని జాయింట్ వెంచరుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



# మార్కెట్లోకి బిగ్‌బాస్ ఎంట్రీ





న్యూఢిల్లీ: దశాబ్దకాలంగా వాయిదా పడుతూ వస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) పబ్లిక్ ఇష్యూకి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఐపీవో విషయంలో ముందుకెళ్లేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీ చేసింది. ఇష్యూకి సెబీ అనుమతి లభించడం తమ సంస్థ ప్రయాణంలో కీలక మైలురాయని ఎన్‌ఎస్‌ఈ చైర్‌పర్సన్ శ్రీనివాస్ ఇంజేటి తెలిపారు. భాగస్వాములందరికి మరింత విలువను జోడించేందుకు ఇది తోడ్పడగలదని చెప్పారు. ఎన్‌వోసీ లభించిన తర్వాత ఇష్యూకి రావడానికి ఏడు నుంచి ఎనిమిది నెలలు పట్టొచ్చని ఎన్‌ఎస్‌ఈ ఎండీ ఆశీష్ కుమార్ చౌహాన్ గతంలో తెలిపారు. సంస్థ ఐపీవో దేశీయంగా అతి పెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలుస్తుందనే అంచనాలు నెలకొన్నాయి. ఎన్‌ఎస్‌ఈలో సుమారు 1.77 లక్షల షేర్‌హోల్డర్లుండగా, అన్‌లిస్టెడ్ గ్రే మార్కెట్లో రూ. 5 లక్షల కోట్ల పైగా విలువ పలుకుతోందని అనలిస్టులు తెలిపారు. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ప్రస్తుత షేర్‌హోల్డర్ల వాటాల విక్రయం ద్వారా రూ. 10,000 కోట్లు సమీకరించేందుకు 2016లో ఎన్‌ఎస్‌ఈ మొదటిసారిగా ముసాయిదా ఆఫర్ పత్రాలను సమర్పించింది. అయితే, గవర్నెన్స్ లోపాల ఆరోపణలు, కో-లొకేషన్ కేసు తదితర అంశాల కారణంగా పబ్లిక్ ఇష్యూకి అప్పట్లో సెబీ ఆమోదముద్ర వేయలేదు. ఆ తర్వాత నుంచి ఎన్‌ఎస్‌ఈ పలు మార్లు సంప్రదింపులు జరుపుతూనే ఉంది. రూ. 1,388 కోట్లు చెల్లించి కో- లొకేషన్ కేసును పరిష్కరించుకునేందుకు ఎన్ఎస్ ఈ గతేడాది ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో కంపెనీ లిస్టింగ్ ప్రణాళికలను పరిశీలించేందుకు 2025 మార్చ్‌లో అంతర్గతంగా కమిటీని వేసింది. సెటిల్మెంట్ అభ్యర్థనకు ఆమోదముద్ర వేసినట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే ఇటీవలే తెలిపారు.

# శామ్‌సంగ్ నుంచి ఏఐ ఏసీలు
# 30% వరకు విద్యుత్ ఆదా

దిల్లీ: ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగ్గజం శామ్‌సంగ్ ఇండియా, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విండ్‌ఫ్రీ ఎయిర్ కండీషనర్లను (ఏసీలు) అందుబాటులోకి తేనుంది. వీటి ద్వారా వినియోగదార్లకు 30% వరకు విద్యుత్ ఆదా అవుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో రూమ్ ఏసీల విభాగం మొత్తానికి ఏఐ సాంకేతికతను అనుసంధానం చేసిన తొలి కంపెనీగా శామ్‌సంగ్ నిలవనుంది. 2026లో 23 కొత్త విండ్‌ఫ్రీ ఏసీల మోడళ్లను కంపెనీ తీసుకొని రానుంది. బీస్పోక్ ఏఐ సాంకేతికతను వీటికి అమర్చింది. ఇప్పటికే ఇలాంటి సాంకేతికతను రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్‌లు, డ్రైయర్లు లాంటి గృహోపకరణాలకు శామ్‌సంగ్ ఉపయోగించింది. ఏఐ ఎనర్జీ మోడ్, స్మార్ట్ థింగ్స్ హోమ్‌కేర్ ద్వారా వినియోగదార్లు విద్యుత్తును 30% వరకు ఆదా చేసుకోవచ్చని శామ్‌సంగ్ తెలిపింది.



## రామ్‌చరణ్, ఉపాసనకు కవలలు.. ఆనందంలో చిరంజీవి



హైదరాబాద్: సినీ నటుడు రామ్‌చరణ్ మరోసారి తండ్రి అయ్యారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఆయన భార్య ఉపాసన కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఒక పాప, బాబుకు ఉపాసన జన్మనిచ్చారని చిరంజీవి శనివారం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, గ్రాండ్ పేరెంట్స్‌గా ఈ శిశువులను తమ ఫ్యామిలీలోకి సంతోషంగా ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. రామ్‌చరణ్, ఉపాసనలకు 2023, జూన్ 20న తొలి సంతానంగా క్లీంకార కొణిదెల జన్మించిన విషయం తెలిసిందే.

## ధనుష్‌కి జోడీగా శ్రీలీల



'పరాశక్తి'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన శ్రీలీల.. మరో తమిళ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? ఈసారి ఇంకో అద్భుతమైన ప్రేమకథలో నటిస్తుందా?.. గత కొన్ని రోజులుగా సినీప్రియుల మదిలో మెదులుతున్న ప్రశ్నలివి. ఇప్పుడు వీటన్నిటికీ సమాధానమిస్తూ.. తన రాబోయే తమిళ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది శ్రీలీల. ధనుష్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ పెరియసామి ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'డీ55' (వర్కింగ్ టైటిల్) పేరుతో పట్టాలెక్కిన ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీల నటిస్తుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. శనివారం ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను పంచుకుంది చిత్రబృందం. సాయి అభయంకర్ ఈ చిత్రానికి సంగీతమందించనున్నారు.

# సరికొత్త కాక్‌టెయిల్

గతేడాది 'కుబేర', 'ఛావా' లాంటి వరుస సినిమాలతో మంచి విజయాల్ని అందుకున్న కథానాయిక రష్మిక.. ఈ సంవత్సరం కూడా అంతకు మించిన కథలతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'కాక్‌టెయిల్ 2' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్, రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటోను పంచుకున్నారు దర్శకుడు. "విజయవంతంగా 'కాక్‌టెయిల్ 2' షూటింగ్ ముగిసింది. నా అద్భుతమైన నటీనటులకు, బృందానికి ధన్యవాదాలు. చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ఇది" అనే వ్యాఖ్యల్ని జోడించారు. 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా ఓ సరికొత్త ప్రేమ కథగా దీన్ని తీర్చిదిద్దుతున్నారని, ఈ ఏడాది ద్వితీయార్ధంలో థియేటర్లలోకి రానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# ఆ ఆనందమే వేరు: తరుణ్ భాస్కర్



"యాక్టర్‌గా వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ నా ప్రయారిటీ డైరెక్షనే. ఒక క్రియేటివ్ థాట్‌తో కథ రెడీ చేసుకుని, ఆ కథను స్క్రీన్‌పై చూసుకుంటే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. ఈ ఏడాది నేను నటించిన మరో రెండు సినిమాలు రిలీజ్‌కి రెడీ అవుతున్నాయి. వీటి తర్వాత దర్శకత్వంపై మరింత ఫోకస్ పెడతాను" అని తరుణ్ భాస్కర్ చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. మలయాళ హిట్ ఫిల్మ్ 'జయ జయ జయ జయ హే'కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించిన ఈ చిత్రం జనవరి 30న విడుదలైంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ– "ఈ సినిమాను చూసిన ఆడియన్స్ ఇదొక ఒరిజినల్ సినిమాలానే ఫీలవుతున్నారు. కథకు కనెక్ట్ అవుతున్నారు. ఈ సినిమాలో ఓంకార్ నాయుడు పాత్ర చేశాను. యాక్టర్‌గా నేనిప్పటివరకు చేసిన రోల్స్‌లో నాకు ఇది చాలెంజింగ్. నేను పుట్టి పెరిగింది అంతా తెలంగాణలోనే. కానీ ఓంకార్ నాయుడు పాత్ర గోదావరి యాస మాట్లాడాలి. నా మిత్రుడు వర్మ, లాంగ్వేజ్ కోచ్ వినోద్‌గార్ల సహాయంతో ఈ రోల్ చేశాను. డైలాగ్స్ లేకుండా ఎమోషన్ చూపించడం టఫ్. ఈషా ఈ పాత్రను అద్భుతంగా చేసింది. ఈ సినిమా క్రెడిట్ అంతా సజీవ్‌దే. 'ఈ నగరానికి ఏమైంది?' పార్టు 2 చిత్రీకరణ జరుగుతోంది. 30 ఏళ్లు దాటిన తర్వాత అబ్బాయిలకు ఉండే సమస్యలు, టెన్షన్స్‌తో ఈ సినిమా కథ సాగుతుంది. వెంకటేశ్‌గారు హీరోగా నా డైరెక్షన్‌లోని సినిమాకు ఇంకా వర్క్ చేయాలి" అని చెప్పారు.

# ఎస్ఎస్ఆర్ 61 ఆరంభం



దేవిశ్రీ ప్రసాద్, సింగీతం శ్రీనివాసరావు, నాగ్ అశ్విన్ ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. 'ఎస్ఎస్ఆర్ 61' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై నాగ్ అశ్విన్ నిర్మించనున్నారు. ఈ మూవీ ప్రారంభం సందర్భంగా విడుదల చేసిన వీడియోలో సింగీతం క్రియేటివిటీ, ఆయనకి సినిమాలపై ఉన్న ప్రేమ, తరతరాల దర్శకులపై ఆయన ప్రభావాన్ని గుర్తు చేసే క్లిప్స్ ఆకట్టుకున్నాయి. "సింగీతం శ్రీనివాసరావుగారు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ' మూవీకి క్రియేటివ్ సహకారం అందించిన ఆయన... ఇప్పుడు స్వయంగా 'ఎస్ఎస్ఆర్ 61' కోసం దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం మరింత ఎనర్జీని తీసుకు రానుంది. ఈ ప్రాజెక్ట్ భారతీయ సినిమాలో ఒక మైలురాయిలా నిలిచేలా ఉంటుంది" అని యూనిట్ పేర్కొంది.

# ఆద్యంతం నవ్వించేలా 'ఫంకీ'

"కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'ఫంకీ'. ఇది అందరికీ మంచి అనుభూతిని అందిస్తుంది' అన్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ సినిమాని కేవీ అనుదీప్ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నరేశ్, వీటీవీ గణేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. "రట్టాటటావ్.." అంటూ సాగిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. దేవ్ పవార్ సాహిత్యమందించారు. రామ్ మిరియాల ఆలపించారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "నా గత రెండు చిత్రాలు ప్రేక్షకుల్ని పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయాయి. అందుకే అందరి ఫీడ్‌బ్యాక్ తీసుకుని.. 'ఫంకీ'తో నా ప్రయాణాన్ని మళ్లీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా. అనుదీప్ రచన, హాస్యం భిన్నంగా ఉంటాయి. తను చాలా ప్రత్యేకమైన వ్యక్తి. ఆయనతో పని చేశాక నేను సినిమాని, జీవితాన్ని చూసే కోణం మారిపోయింది" అన్నారు. "ఆద్యంతం నవ్వించే సినిమా ఇది. దీంట్లో భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది" అంది నటి కయాదు లోహర్. దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ.. "ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వులు పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్ పవార్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.



# అలరించే క్రైమ్ కామెడీ

'సంక్రాంతికి కుటుంబంతో కలిసి సినిమా చూస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రమే 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'' అన్నారు నటుడు శివాజీ. ఆయన.. లయ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్.. ఈ నెల 12 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో రిలీజ్ డేట్‌ని ప్రకటించడంతో పాటు ఓ పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. "నేను చాలా కష్టాల్లో ఉన్నప్పుడు ఈటీవీనే నాకు మళ్లీ అవకాశమిచ్చింది. వాళ్ల ప్రోత్సాహంతోనే 'చి90స్' వెబ్‌సిరీస్ చేశాను. దీన్ని నేనెప్పటికీ మర్చిపోలేను. సుధీర్ కొత్త దర్శకుడైనప్పటికీ కథని అద్భుతంగా చెప్పాడు. ఒక మంచి కంటెంట్ ఈ నెల 12న మీ ముందుకొస్తుంది. 'దండోరా'లాగే ఈ చిత్రాన్నీ సూపర్ హిట్ చేస్తారని ఆశిస్తున్నా" అన్నారు. "మిస్సమ్మ'తో అందరూ నన్ను రత్నమాలగా గుర్తు పెట్టుకున్నారు. ఇక నుంచి ఈ సినిమాతో ఉత్తరగా గుర్తు పెట్టుకుంటారు. నా కెరీర్‌లోనే చాలా ప్రత్యేకమైన పాత్రిది" అన్నారు నటి లయ. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "ఇది మంచి క్రైమ్ కామెడీ సినిమా. మా గత సినిమాలు ఎలా అయితే అందర్నీ అలరించాయో.. ఈ చిత్రం కూడా మిమ్మల్ని అలాగే అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ శ్రీరామ్, ప్రిన్స్, రోహన్, భోలే షావలి తదితరులు పాల్గొన్నారు.



# 2026–ఛాంప్ రిబకినా

**ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం**

**ఫైనల్లో సబలెంకాపై విజయం**



రిబకినా అదరగొట్టింది. పోరాటపటిమను ప్రదర్శిస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. రసవత్తరంగా సాగిన ఫైనల్లో ఆమె ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంకాను ఓడించింది. 2023 ఫైనల్లో బెలారస్ స్టార్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. కెరీర్‌లో రిబకినాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్.

**మెల్‌బోర్న్ ...:** ఎలెనా రిబకినా (కజకిస్థాన్) ఎట్టకేలకు తన రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె విజేతగా నిలిచింది. శనివారం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో అయిదో సీడ్ రిబకినా 64, 46, 64తో టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)పై విజయం సాధించింది. రిబకినా 2022 (వింబుల్డన్)లో తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకుంది. సబలెంకా తన చివరి నాలుగు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో మూడు ఓడిపోవడం గమనార్హం. తుది పోరులో రిబకినా ఒత్తిడిని తట్టుకుని నిలిచింది. మ్యాచ్‌లో ఆమె 6 ఏస్‌లు, 28 విన్నర్లు కొట్టింది. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సబలెంకా 26 అనవసర తప్పిదాలతో దెబ్బతింది.

**హోరాహోరీగా..:** మెల్‌బోర్న్ పార్క్‌లో 2023 ఫైనల్లో రిబకినాను ఓడించిన సబలెంకా..ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. కానీ ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ నంబర్ 2 స్వైటెక్, ఆరో సీడ్ జెస్సికా పెగులాను ఓడించిన రిబకినా.. చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించింది. బలంగా పోరును ఆరంభించింది. ప్రత్యర్థి పవర్ హిట్టింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంది. రిబకినా తొలి సెట్ తొలి గేమ్‌లోనే సబలెంకా సర్వీసును బ్రేక్ చేసింది. ఆ తర్వాత సర్వీసు నిలబెట్టుకుంటూ సాగింది. తన తొలి మూడు సర్వీసుల్లో ఆమె మూడు పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ఆ తర్వాత సబలెంకాకు రెండు బ్రేక్ పాయింట్లు లభించినా సద్వినియోగం చేసుకోలేక పోయింది. కడవరకూ ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న రిబకినా.. సెట్‌ను చేజిక్కించుకుంది. రెండో సెట్ ఆరంభంలో సబలెంకా ఒత్తిడి పెంచినా.. రిబకినా తట్టుకుంది. ఇద్దరూ సర్వీసులు నిలబెట్టుకుంటూ సాగడంతో 44తో సమంగా నిలిచారు. తొమ్మిదో గేమ్‌లో విజయవంతంగా సర్వీసు చేసిన సబలెంకా 54లోకి వెళ్లింది. కీలకమైన పదో గేమ్‌లో రిబకినా తడబడింది. మూడు బ్రేక్ పాయింట్లు సంపాదించిన సబలెంకా.. అలవోకగా గేమ్‌ను గెలిచి, 64తో సెట్‌ను సొంతం చేసుకుంది. అదే జోరులో మూడో సెట్లోనూ ఆమె 30తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రిబకినా బలహీన సర్వీసులను సొమ్ము చేసుకున్న సబలెంకా.. రెండో గేమ్‌లో బ్రేక్ సాధించింది. ఆమెకు మార్గం సుగమమైనట్లేనని అనిపించింది. కానీ 03తో వెనుకబడ్డ రిబకినా గట్టిగా పోరాడి నిలిచింది. వరుసగా రెండు బ్రేక్‌లు సాధించి 53తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాతి గేమ్‌లో సబలెంకా విజయవంతంగా సర్వ్ చేసినా.. పదో గేమ్‌లో రిబకినాను అడ్డుకోలేకపోయింది. రెండు భారీ సర్వీసులతో రిబకినా మ్యాచ్‌ను ముగించింది.

**మెర్టెన్స్, జాంగ్ జోడీకి డబుల్స్ టైటిల్.....:** మహిళల డబుల్స్‌లో మెర్టెన్స్ (జర్మనీ), జాంగ్ (చైనా) జంట విజేతగా నిలిచింది. ఫైనల్లో ఈ ద్వయం 76 (74), 64తో అనా డానిలినా (కజకిస్థాన్), అలెగ్జాండ్రా కుర్నిక్ (సెర్బియా) జోడీని ఓడించింది. క్రిస్టియన్ హారిసన్ (అమెరికా), నీల్ స్కుప్స్కీ (బ్రిటన్) ద్వయం పురుషుల డబుల్స్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ జంట 76 (74), 64తో ఆస్ట్రేలియాకు చెందిన కుబ్లెర్, పోల్మాన్స్‌లపై గెలిచింది.

# ఎవరిదో టైటిల్

**జకోవిచ్ × అల్కరాస్ ఫైనల్ నేడు**



**మెల్‌బోర్న్....:** మరొక్కటి గెలిస్తే చాలు టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలిచిన ప్లేయర్‌గా అతడు రికార్డు సృష్టిస్తాడు. కానీ ఆ ఒక్కటి మాత్రం చాలా కాలంగా అతణ్ని ఊరిస్తూనే ఉంది. ఇప్పటికే 24 టైటిళ్లతో మార్గరెట్ కోర్ట్‌తో ఆల్‌టైమ్ రికార్డును పంచుకుంటున్న నొవాక్ జకోవిచ్, 25 కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యుఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోయాడు. ఆ తర్వాత అతడు ఒకే ఒక్కసారి మేజర్ టోర్నీ ఫైనల్ (2024 వింబుల్డన్) చేరాడు. అయితే ఆ ఒక్కటి కొట్టేయడానికి జకోవిచ్ (సెర్బియా)కు ఇప్పుడు సువర్ణావకాశం లభించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఆదివారం అతడు.. ప్రపంచ నంబర్‌వన్ అల్కరాస్ (స్పెయిన్)ను ఢీకొంటాడు. మామూలుగా అయితే 38 ఏళ్ల జకోవిచ్‌తో పోరులో 22 ఏళ్ల అల్కరాస్‌నే ఫేవరెట్‌గా పరిగణించేవాళ్లు. కానీ రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్, రెండో సీడ్ సినర్‌ను సెమీస్‌లో ఓడించిన నొవాక్.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో పోరుకు సిద్ధమయ్యాడు. ఇంతకుముందు ఇక్కడ ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. మరోవైపు పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్నవయస్కుడిగా రికార్డు సృష్టించాలని అల్కరాస్ తహతహలాడుతున్నాడు.

# ఈఎస్ఎల్ క్రికెట్ ఫైనల్స్ నేడు

ఈఎస్ఎల్ క్రికెట్ చివరి అంకానికి చేరుకుంది. గుంటూరు జిల్లా నంబూరులోని ఎం.ఎస్.కె.ప్రసాద్ స్పోర్ట్స్ అకాడమీ గ్రౌండ్‌లో ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సీనియర్స్‌లో రాయలసీమ రాకర్స్, హైదరాబాద్ హీరోస్ జట్లు.. జూనియర్స్‌లో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ హైదరాబాద్ హీరోస్ జట్లు అమీతుమీ తేల్చుకుంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 1,047 జట్లు ఈ టోర్నీలో పోటీ పడ్డాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు గుంటూరుకు సమీపంలోని మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జనవరి 27న మొదలయ్యాయి. ఇప్పుడు ఫైనల్స్‌కు రంగం సిద్ధమైంది.

# హద్దుల్లేని విధ్వంసం




**–భారత్ 271/5.. కివీస్ 225**

**–ఇషాన్ మెరుపు సెంచరీ**

**–చివరి టీ20లో సూర్యసేనదే పైచేయి**

40 ఓవర్ల ఆటలో ఏకంగా 496 పరుగులు.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 36 ఫోర్లు, 36 సిక్సర్లు.. కేవలం బౌండరీలతోనే వచ్చిన స్కోరు 360.. బ్యాటర్లలో ఒక శతకం, రెండు అర్ధశతకాలు.. అయిదు 30+ స్కోర్లు.. బౌలర్లలో అయిదుగురి అర్ధసెంచరీలు.. ఇదీ భారత్, న్యూజిలాండ్ చివరి టీ20లో గణాంకాల లెక్క! బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన పిచ్‌పై బ్యాటర్లు తాండవం ఆడేశారు. బుమ్రా, జేమీసన్ లాంటి మేటి ఫాస్ట్‌బౌలర్లు కూడా నిస్సహాయులుగా మారిన తిరువనంతపురంలో.. ఏకంగా 271 పరుగుల స్కోరు సాధించిన టీమ్‌ఇండియాదే పైచేయి అయింది. సిరీస్‌ను ఘనంగా ముగించిన టీమ్‌ఇండియా.. ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది. కివీస్‌తో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా 41 ఆధిక్యంతో ముగించింది. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ గెలిచాక, నాలుగో టీ20లో షాక్ తిన్న భారత్.. శనివారం చివరి టీ20లో 46 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (103; 43 బంతుల్లో 6×4, 10×6) విధ్వంసక శతకానికి.. కెప్టెన్ సూర్యకుమార్ (63; 30 బంతుల్లో 4×4, 6×6), హార్దిక్ పాండ్య (42; 17 బంతుల్లో 1×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్‌లు తోడవడంతో భారత్ 5 వికెట్లకు 271 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫెర్గూసన్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో కివీస్ కూడా దీటుగానే స్పందించినప్పటికీ.. లక్ష్యం అసాధ్యమైంది కావడంతో ఓటమి తప్పలేదు. ఆ జట్టు 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. ఫిన్ అలెన్ (80; 38 బంతుల్లో 8×4, 6×6) చెలరేగాడు. అర్ష్‌దీప్ 5 వికెట్ల ప్రదర్శన చేసినప్పటికీ భారీగా పరుగులిచ్చేయగా.. బౌలర్లకు కాళరాత్రిలా మారిన మ్యాచ్‌లో అక్షర్ పటేల్ (3/33) అదరగొట్టాడు. సూర్య 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

**–8వ ఓవర్లోనే వంద.....:** లక్ష్యాన్ని ఛేదించడం అసాధ్యంగా కనిపించినా.. కివీస్ మాత్రం పోరాటం ఆపలేదు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఫిన్ అలెన్, ఇప్పటిదాకా తనకు అవకాశం ఇవ్వనందుకు కివీస్ చింతించేలా రెచ్చిపోయి ఆడాడు. అతడి ధాటికి అర్ష్‌దీప్ తొలి 2 ఓవర్లలో 40 పరుగులు సమర్పించుకున్నాడు. అతను బుమ్రానూ వదిలిపెట్టలేదు. స్పిన్నర్ల బౌలింగ్‌లో మరింత చెలరేగాడు. మరో ఓపెనర్ సీఫర్ట్ (5) త్వరగా వెనుదిరిగినప్పటికీ.. రచిన్ (30; 17 బంతుల్లో 2×4, 2×6)తో కలిసి స్కోరు బోర్డును అలెన్ పరుగులు పెట్టించాడు. వీళ్లిద్దరి ధాటికి కివీస్ 8 ఓవర్లకే 100 దాటేసింది. ఈ ఊపు చూస్తే కివీస్ సంచలనం రేపుతుందా అనిపించింది. కానీ తర్వాతి ఓవర్లో అలెన్‌ను ఔట్ చేసి కివీస్‌కు బ్రేకులేశాడు అక్షర్. ప్రమాదకర ఫిలిప్స్ (7) ఎక్కువసేపు నిలవకపోవడం.. అర్ష్‌దీప్ ఒకే ఓవర్లో రచిన్, శాంట్నర్ (0)లను ఔట్ చేయడంతో కివీస్‌కు ఓటమి ఖాయమైపోయింది. తర్వాత మిచెల్ (26) కాస్త పోరాడాడు. 17 ఓవర్లకు 191/9 నిలిచిన కివీస్.. 200 మార్కును అందుకోవడం కష్టమే అనుకుంటే.. ఇష్ సోధి (33; 15 బంతుల్లో 1×4, 3×6) అనూహ్యంగా చెలరేగి స్కోరును 225 వరకు తీసుకెళ్లాడు.

**–బాదుడే బాదుడు......:** టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. కివీస్ బౌలింగ్‌ను మామూలుగా ఆడుకోలేదు. తన సొంతగడ్డపైనా ఫామ్ అందుకోలేకపోయిన సంజు శాంసన్ 6 పరుగులకే వెనుదిరిగినా.. అభిషేక్ (30; 16 బంతుల్లో 4×4, 2×6) జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. అతణ్ని ఫెర్గూసన్ బౌల్డ్ చేసి బ్రేక్ ఇచ్చినప్పటికీ.. పరుగుల జోరు ఎంతోసేపు ఆగలేదు. ఇషాన్ కిషన్.. అభిషేక్‌ను మించిన దూకుడుతో కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ సూర్య కూడా భారీ షాట్లతో రెచ్చిపోయాడు. వీళ్లిద్దరూ సింగిల్స్ తీసినంత సులువుగా సిక్సర్లు, ఫోర్లు బాదేశారు. పదో ఓవర్లో సెంచరీ మార్కును దాటిన భారత్.. 13వ ఓవర్‌కే 150 దాటేసింది. 16 ఓవర్లకే 200 మార్కును చేరుకుంది. మధ్యలో సూర్య ఔటైనా.. కివీస్‌కు ఉపశమనం లేకపోయింది. ఇషాన్, హార్దిక్ బాదుడుతో స్కోరు ఎక్కడికో వెళ్లిపోయింది. 84 పరుగుల వద్ద ఒంటి చేత్తో ఇషాన్ కొట్టిన షాట్‌కు మిడ్ వికెట్‌లో బౌండరీ వద్ద ఫెర్గూసన్ క్యాచ్ అందుకునే ప్రయత్నం చేశాడు. కానీ బంతి అతడి చేతుల్లో పడి బౌండరీ అవతలికి వెళ్లడంతో సిక్సర్ అయింది. శాంట్నర్ వేసిన 17వ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో ఇషాన్ సెంచరీ పూర్తి చేయడం విశేషం. తర్వాతి ఓవర్లోనే అతను ఔటైనా.. హార్దిక్ చివరి ఓవర్లో వెనుదిరిగే వరకు విధ్వంసాన్ని కొనసాగించాడు. భారత ఇన్నింగ్స్‌లో ఫోర్లను (17) మించి సిక్సర్లు (23) నమోదవడం విశేషం.

**––సంజు.. వైఫల్యం పరిపూర్ణం.....** టీ20 ప్రపంచకప్ ముంగిట చివరి సిరీస్‌ను భారత జట్టు బాగా ఉపయోగించుకుంది. 41తో బలమైన న్యూజిలాండ్‌ను ఓడించడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. ముఖ్యంగా బ్యాటింగ్‌లో భారత్‌కు తిరుగులేదు. ఈ సిరీస్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ అందుకోవడం అతి పెద్ద సానుకూలాంశం. అనుకోకుండా జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ కూడా అదరగొట్టాడు. అభిషేక్ ఎప్పట్లాగే ఆకట్టుకున్నాడు. దూబె, హార్దిక్, రింకు కూడా సమయోచితంగా మెరుపులు మెరిపించాడు. కానీ ఒక్క సంజు శాంసన్ విషయంలో మాత్రం నిరాశ తప్పలేదు. అసలే అంతంతమాత్రం ఫామ్‌తో అతను సిరీస్‌లో అడుగు పెట్టాడు. అయిదు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్‌గా అవకాశాలు దక్కినప్పటికీ.. ఒక్కసారీ కనీసం 30 పరుగులు చేయలేదు. 10, 6, 0, 24, 6.. ఇవీ అతడి స్కోర్లు. 9.2 సగటుతో కేవలం 46 పరుగులు చేశాడు. ప్రపంచకప్ ముంగిట చివరి మ్యాచ్‌లో, సొంతగడ్డ అయిన తిరువనంతపురంలో అయినా రాణిస్తాడనుకుంటే.. ఇక్కడా ఘోరంగా విఫలమయ్యాడు.

**––పాపం బౌలర్లు.....** బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన తిరువనంతపురం పిచ్.. బౌలర్ల పాలిట శాపంగా మారింది. బ్యాటర్ల బాదుడుకు పాపం బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ప్రపంచ క్రికెట్లో ఫార్మాట్ ఏదైనా పొదుపుగా బౌలింగ్ చేసే బౌలర్లలో బుమ్రా ఒకడు. అలాంటి బౌలర్ తన కెరీర్లోనే అత్యంత పేలవ గణాంకాలు నమోదు చేశాడు. 4 ఓవర్లలో వికెట్ లేకుండా ఏకంగా 58 పరుగులు సమర్పించుకున్నాడు. 5 వికెట్లు తీసినప్పటికీ, అర్ష్‌దీప్ 51 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక కివీస్ బౌలర్ల పరిస్థితి అయితే దయనీయం. ఒక్క ఓవరే వేసిన గ్లెన్ ఫిలిప్స్ 10 పరుగులే ఇచ్చి బతికిపోయాడు కానీ.. మిగతా బౌలర్ల గణాంకాలన్నీ చెల్లాచెదురైపోయాయి. ఫిలిప్స్ కాకుండా అయిదుగురు బౌలర్లలో అతి తక్కువ ఎకానమీ 4 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చిన జాకబ్ డఫీ (13.25)దే. ఇష్ సోధి ఏకంగా 16 ఎకానమీతో 3 ఓవర్లలో 48 పరుగులు సమర్పించుకున్నాడు. శాంట్నర్ 15 ఎకానమీతో 4 ఓవర్లలో 60 పరుగులతో అతడికి గట్టి పోటీ ఇచ్చాడు. జేమీసన్ 4 ఓవర్లలో 59 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇష్ సోధి వేసిన 12 ఓవర్ ఒకదాంట్లోనే ఏకంగా 29 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఇషాన్ కిషన్.. వరుసగా 4, 4, 4, 6, 4, 6 బాదేశాడు.

**––3030......** అంతర్జాతీయ టీ20ల్లో సూర్యకుమార్ పరుగులు. భారత్ తరఫున రోహిత్ (4231), కోహ్లి (4188)ల తర్వాత 3 వేల మైలురాయిని దాటింది అతనే.

**––271/5....** భారత్‌కు టీ20ల్లో ఇది మూడో అత్యధిక స్కోరు. 2024లో బంగ్లాదేశ్‌పై 297/6, దక్షిణాఫ్రికాపై 283/1 స్కోర్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

**భారత్ ఇన్నింగ్స్....:** అభిషేక్ శర్మ (బి) ఫెర్గూసన్ 30; సంజు శాంసన్ (సి) జాకబ్స్ (బి) ఫెర్గూసన్ 6; ఇషాన్ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 103; సూర్యకుమార్ (స్టంప్డ్) సీఫర్ట్ (బి) శాంట్నర్ 63; హార్దిక్ (సి) జాకబ్స్ (బి) జేమీసన్ 42; రింకు నాటౌట్ 8; దూబె నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 271; వికెట్ల పతనం: 131, 248, 3185, 4233, 5261; బౌలింగ్: డఫీ 40531; జేమీసన్ 40591; ఫెర్గూసన్ 40412; ఇష్ సోధి 30480; ఫిలిప్స్ 10100; శాంట్నర్ 40601

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్.....:** సీఫర్ట్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 5; అలెన్ (సి) రింకు (బి) అక్షర్ 80; రచిన్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 30; ఫిలిప్స్ (సి) రింకు (బి) అక్షర్ 7; మిచెల్ (బి) అర్ష్‌దీప్ 26; శాంట్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 0; జాకబ్స్ (బి) వరుణ్ 7; జేమీసన్ (బి) అర్ష్‌దీప్ 9; సోధి (సి) అర్ష్‌దీప్ (బి) రింకు 33; ఫెర్గూసన్ (బి) అక్షర్ 3; డఫీ నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 16 మొత్తం: (19.4 ఓవర్లలో ఆలౌట్) 225; వికెట్ల పతనం: 117, 2117, 3131, 4137, 5137, 6166, 7179, 8180, 9191; బౌలింగ్: అర్ష్‌దీప్ 40515; హార్దిక్ 20150; బుమ్రా 40580; వరుణ్ 40361; అక్షర్ పటేల్ 40333; అభిషేక్ 10130; రింకు 0.4071





# ప్రతీకార పోరు

**–పాక్‌తో భారత్ సూపర్ సిక్సెస్ మ్యాచ్ నేడు**

**–అండర్-19 వన్డే ప్రపంచకప్**

**–మధ్యాహ్నం 1 నుంచి**



అండర్ 19 వన్డే ప్రపంచకప్‌లో అపజయమే లేకుండా సాగిపోతున్న భారత జట్టు.. సూపర్‌సిక్సెస్‌లో కీలక పోరుకు సిద్ధమైంది. ఆయుష్ మాత్రే బృందం.. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడబోతోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ నేరుగా సెమీస్‌లో అడుగు పెడుతుంది. పాక్ ఇంటిముఖం పడుతుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్‌కు అవకాశముంటుంది. కానీ తక్కువ తేడాతో ఓడాలి. గ్రూప్ 1 నుంచి ఇప్పటికే ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్ సెమీస్ చేరాయి. గ్రూప్ 2లో ఇంగ్లాండ్ బెర్తు ఖాయం చేసుకుంది. చివరి బెర్తు కోసం భారత్, పాక్ మధ్య పోటీ నెలకొంది. చివరగా పాక్‌తో తలపడ్డపుడు భారత్‌కు పరాభవం ఎదురైంది. డిసెంబరులో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఏకంగా 191 పరుగుల తేడాతో ఓడింది యువ భారత్. ప్రపంచకప్‌లో పాక్‌ను ఇంటిముఖం పట్టించి, ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని కుర్రాళ్లు పట్టుదలతో ఉన్నారు. గ్రూప్ దశలో మూడుమ్యాచ్‌ల్లోనూ గెలిచి సూపర్‌సిక్స్ చేరిన భారత్.. ఈ దశలో తన తొలి మ్యాచ్‌లో 200కు పైగా పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఇదే ఊపులో పాక్‌నూ ఓడించాలని ఆయుష్‌సేన చూస్తోంది. కానీ సూపర్‌సిక్స్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించిన పాక్.. అంత తేలిగ్గా లొంగకపోవచ్చు. ఫర్హాన్ యూసుఫ్ నేతృత్వంలోని ఆ జట్టు ఆల్‌రౌండ్ బలంతో కనిపిస్తోంది. భారత బ్యాటర్లలో ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు జోరుమీదున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు వైభవ్, ఆయుష్ ఆరంభంలో క్రీజులో కుదురుకున్నారంటే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో అంబ్రిష్, ఉద్ధవ్, హెనిల్, ఖిలాల్ కీలకం.

# క్రమశిక్షణ తప్పినందుకే...

**––మన్‌ప్రీత్‌సింగ్‌పై వేటు వేసిన హాకీ ఇండియా**

ప్రొ లీగ్ టోర్నీ కోసం గురువారం 33 మంది ప్రాబబుల్స్‌తో ప్రకటించిన భారత హాకీ జట్టులో స్టార్ ప్లేయర్ మన్‌ప్రీత్ సింగ్‌కు చోటు దక్కకపోవడం చర్చకు దారి తీసింది. మన్‌ప్రీత్‌తో పాటు మరో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు దిల్‌ప్రీత్ సింగ్, కృషన్ బహదూర్ పాఠక్‌లను టీమ్ నుంచి తప్పించారు. అయితే వీరంతా తీవ్ర క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకు ఈ చర్య తీసుకున్నట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) వర్గాలు వెల్లడించాయి. ఇటీవల డిసెంబరులో భారత జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించినప్పుడు వారు నిబంధనలు ఉల్లంఘించారని హెచ్ఐ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ టూర్‌లో 3 మ్యాచ్‌లు ఆడిన భారత్ 2 ఓడి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. 'జట్టు సమావేశానికి ఒక ఆటగాడు గైర్హాజరు కావడంతో వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాం. అప్పుడు మరింత తీవ్రమైన అంశాలు బయటకు వచ్చాయి. మన్‌ప్రీత్, దిల్‌ప్రీత్, కృషన్ కలిసి ఆ ఆటగాడికి నిషేధిత ఉత్ప్రేరకం కలిపిన చూయింగ్ గమ్‌ను ఇచ్చారు. దానిని వాడిన అతను స్పృహ కోల్పోయి టీమ్ మీటింగ్‌కు దూరమయ్యాడు. దాని ప్రభావం రాత్రంతా ఉండటంతో పాటు తర్వాతి ఉదయం కూడా సాధారణ స్థితికి రాలేకపోయాడు. విచారణ చేస్తే ఆ ముగ్గురి పాత్ర ఉన్నట్లు తేలింది. వీరంతా ఆ తర్వాత క్షమాపణలు చెప్పినా... వచ్చే టోర్నీ కోసం జరిగే శిబిరానికి వీరిని ఎంపిక చేయరాదనే నిర్ణయం అప్పుడే జరిగిపోయింది' అని ఆయన వివరించారు. అయితే దీనిపై కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ హాకీ ఇండియాకు ఎలాంటి రాత పూర్వక ఫిర్యాదు మాత్రం చేయలేదు. పైగా మన్‌ప్రీత్‌కు మద్దతు పలుకుతూ జట్టు నుంచి తప్పించరాదని కూడా ఫుల్టన్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఎన్నో కీలక టోర్నీలు ఉన్న నేపథ్యంలో ఎంతో అనుభవం ఉన్న మన్‌ప్రీత్ అవసరం జట్టుకు ఉందని... అతడిని తొలగిస్తే తానూ రాజీనామా చేస్తానని కూడా కోచ్ హెచ్చరించినట్లు తెలిసింది. అయితే హాకీ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ తిర్కీ, భోలానాథ్ సింగ్, చీఫ్ సెలక్టర్ ఆర్పీ సింగ్ చివరకు కోచ్‌ను ఒప్పించడంలో సఫలమయ్యారు.